రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మంచిర్యాల అర్బన్, మార్చి 29: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ ఏరియాలో గల అంబేద్కర్ బొమ్మ వద్ద రాత్రి 2.30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపారు. శనివారం వారు తెలిపిన వివరాల ప్రకారం మృతి చెందిన వృద్ధురాలు దాదాపు 55 నుంచి 60 ఏండ్ల వయసు ఉంటుందని, ఎర్ర రంగు జాకెట్, గులాబి రంగు చీర ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపరిచామని, వృద్ధురాలి వివరాలు తెలిసిన వారు 8712656534, నంబర్‌లో సమాచారం అందించాలని సీఐ వెల్లడించారు.

నాటుసారా పట్టివేత

వేమనపల్లి, మార్చి 29 : మండలంలోని సూరారం గ్రామంలో శనివారం స్థానిక యువకులు 50 లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. నెన్నెల మండలం లంబాడి తండాకు చెందిన ధరావత్ రవీందర్ 50 లీటర్ల నాటుసారా తీసుకువచ్చి విక్రయిస్తుండగా యువకులు అతడిని పట్టుకుని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్‌కు సమాచారం అందించారు. రవీందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. యువకులను ఎస్ఐ అభినందించారు. అనంతరం యువకులతో కలిసి గ్రామంలో సారా, గుడుంబా అరికట్టడంపై అవగాహన ర్యాలీ తీశారు.

కాల్‌టెక్స్ ఏరియాలో దొంగల హల్‌చల్

బెల్లంపల్లి, మార్చి 29 : పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో రెండు ఇళ్లలో శనివారం తెల్లవారుజామున దొంగతనానికి పాల్పడి దొంగలు బీభత్సం సృష్టించారు. ఇటీవలే గృహ ప్రవేశం చేసిన బీఆర్ఎస్ నాయకుడు సాన శ్రావణ్ తన ఇంట్లో నిద్రిస్తుండగా దొంగతనానికి పాల్పడ్డారు. బీరువా పగుల కొట్టి పద్నాలుగున్నర తులాల బంగారం, కిలోన్నర వెండి వస్తువులు, రూ.20వేల నగదు అపహరించుకు వెళ్లారు. పక్కన ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు అత్తే సుధాకర్ ఇంటికి తాళం వేసి ఉండడంతో తాళం పగుల కొట్టి 5 తులాల బంగారం, రూ.70వేల నగదును దొంగిలించారు. పరిసరాల్లో ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న నాలుగు బైక్‌లను అపహరించుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, రూరల్ సీఐ అష్టలుద్దీన్, టూటౌన్, తాళ్లగురిజాల, వన్‌టౌన్ ఎస్ఐలు మహేందర్, రమేశ్, రాకేశ్, ఏఎస్ఐ తిరుపతి ఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అక్కడికి వెళ్లి బాధితులతో మాట్లాడారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★ఉగాది ఆఫర్: ఫ్రీ ప్లాట్ పొందండి. కేవలం 1,000/- రూపాయలతో 6 లక్షల 150 గజాలు ప్లాట్ పొందండి. బుకింగ్ అమౌంట్: 10,000/- EMI 30 నెలలు. Ph: 9392256585 / 7238916456.
NT-330921-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

బెల్లంపల్లి: 91827 77671, 91827 77677

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

హాజీపూర్, మార్చి 29 : మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు చింతపండు రాయలింగును శనివారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావ్, బీఆర్ఎస్ నాయకులు విజిత్ రావు పరామర్శించారు. రాయలింగు ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్ తదితరులున్నారు.

కృత్రిమ మేధను సద్వినియోగం చేసుకోవాలి

నస్పూర్, మార్చి 29 : ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధ సహాయంతో చేస్తున్న బోధన గొప్పదని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం డీఈవో యాదయ్యతో కలిసి మంచిర్యాల పట్టణంలోని సినిమావాడ, గోపాల్‌వాడ ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధ ల్యాబ్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎంఈవో మాలవీదేవి, మాస్టర్‌ట్రైనర్ రాజగోపాల్, సమగ్ర శిక్ష క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయురాళ్లు ప్రభావతి, శృతి, డీసీఈబీ అసిస్టెంట్ కుమారస్వామి, ఉపాధ్యాయులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులందరికీ ఒకే సీనియారిటీ కల్పించాలి

హాజీపూర్, మార్చి 29 : జిల్లాలో 2019 సంవత్సరంలో విధులను చేపట్టిన గ్రామ పంచాయతీ కార్యదర్శులందరికీ ఒకే రకమైన సీనియారిటీ కల్పించాలని కోరుతూ తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావ్‌కు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల ఫోరం అసోసియేట్ అధ్యక్షుడు బొడ్డు శ్రావణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పూదరి నరేందర్, ప్రధాన కార్యదర్శి లకావత్ శ్రీనివాస్ నాయక్, అసోసియేట్ అధ్యక్షుడు గోళ్ల శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సుమన్, వరప్రసాద్ నాయక్, జాయింట్ సెక్రటరీ వంశీకృష్ణ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో క్లరికల్ పోస్టులు భర్తీ చేయాలి

శ్రీరాంపూర్, మార్చి 29 : సింగరేణిలో క్లరికల్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్‌లో ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ విలేకర్లతో మాట్లాడారు. కార్మికుల పర్సనల్ అకౌంట్లు, ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడంలో తీవ్ర పనిభారానికి గురవుతున్నారని చెప్పారు. యాజమాన్యం 14 మార్చి 2023లో 360 మంది జూనియర్ అసిస్టెంట్స్ గ్రేడ్ 2 నియామకాలకు ఇంటర్నల్ నుంచి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఏడాదైనా భర్తీ చేయకపోవడంతో క్లర్క్‌లపై పనిభారం పెరిగిందన్నారు. యాక్టింగ్ క్లర్క్‌లను పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, కేంద్ర కార్యవర్గ సభ్యులు ఎండీ లాలా, గోనె స్వామి, ముత్యాల రమేశ్ పాల్గొన్నారు.

పోస్ట్‌మాన్ తీరుపై అధికారుల ఆగ్రహం

తాండూర్, మార్చి 29 : ప్రభుత్వం అర్హులకు అందిస్తున్న పెన్షన్ల పంపిణీ విషయంలో మాదారం పోస్ట్‌మాన్ ఫారూఖ్ పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉమ్మడి అదిలాబాద్ జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ సిద్ధార్థ్ మాదారం పోస్ట్ ఆఫీస్‌ను తనిఖీ చేశారు. ఇదే సమయంలో పింఛన్ల పంపిణీ అలసత్వం విషయం తెలుసుకున్న ఎంపీడీవో శ్రీనివాస్ అక్కడికి చేరుకొని లబ్ధిదారులతో మాట్లాడారు. స్థానికంగా పోస్ట్‌మాన్ వ్యవహార తీరుపై సిద్ధార్థ కు ఎంపీడీవో వివరించారు. ఆయనపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పింఛన్ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అవసరమైతే గిరిజన గుడాలకు వెళ్లి పంపిణీ చేసేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

'క్యాష్ లేదు..మంగళ వారం రండి'

భీమారం, మార్చి 29 : 'క్యాష్ లేదు.. మంగళవారం రావాలి ' అని రైతులను స్థానిక పోస్ట్ ఆఫీస్ సిబ్బంది వెనక్కు పంపిస్తున్నారు. భీమారం మండలానికి చెందిన పలువురు రైతులు పత్తి డబ్బులు ఖాతాల్లో పడ్డాయని రాగా ఈ రోజు క్యాష్ లేదని మంగళవారం రావాలని తిప్పి పంపించారు. దీంతో రైతులు పోస్టుకు వచ్చి వెళ్తున్నారు. దీనిపై ఎస్‌పీఎం శ్రీనివాస్‌ను వివరణ కోరగా డబ్బులు ఉన్నాయని, ఎస్‌బీఐ బ్యాంక్ కూడా తమ లాగా సర్వీస్ చేయడం లేదని, ఇప్పటికే నాలుగు కోట్ల రూపాయలను ఇచ్చామన్నారు. పింఛన్లు ఇచ్చిన తర్వాత రైతులకు డబ్బులు ఇస్తామని తెలిపారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అంజలీదేవి

అంజలిదేవి

దండేపల్లి, మార్చి29: తెలంగాణ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో దండేపల్లి మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన అంజలిదేవి మొట్టమొదటిసారిగా హైకోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పోటీచేసి గెలుపొందారు. తెలంగాణ హైకోర్టు మహిళా న్యాయవాదుల సమస్యలు, వాటి రక్షణకు సంబంధించిన అంశాలు, జడ్జిమెంట్ కాపీలు సకాలంలో ఉండే విధంగా బార్ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

లేగదూడ యజమానికి నష్టపరిహారం అందజేత

వేమనపల్లి, మార్చి 29 : రెండు నెలల క్రితం ఒడ్డుగూడెం ఫారెస్ట్ బీట్ పరిధిలో లేగ దూడను పులి హతమార్చగా, సుంపుటం గ్రామానికి యజమాని కొండగొర్ల రాజన్నకు శనివారం కుష్నపల్లి అటవీ క్షేత్రాధికారి దయాకర్ రూ. 10 వేల నష్టపరిహారం డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ , ఒడ్డుగూడెం ఎఫ్ఎస్‌వో బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

పెంకుటిల్లు దగ్ధం

బెల్లంపల్లి. మార్చి 29 : మండలంలోని బూధఖుర్దుకు చెందిన పెద్దపల్లి మల్లయ్యకు చెందిన పెంకుటిల్లు శనివారం షార్ట్ సర్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.లక్ష నగదుతో పాటు కొంత బంగారం కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. ఫైర్ స్టేషన్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

రామకృష్ణాపూర్, మార్చి 29: ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోలేకపోతున్నాననే బాధతో బొమ్మన వినయ్ (20) అనేక యువకుడు శనివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్ఐ జి. రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వినయ్ తల్లి బొమ్మన సంతోషిని కొయ్యూరు దగ్గరలోని గంగారం గ్రామం. ఆమె కుమారుడు వినయ్ చిన్నప్పటి నుంచి రామకృష్ణాపూర్‌లోని అబ్రహం నగర్‌లో సంతోషిని తండ్రి లింగారెడ్డి(తాత) ఇంటిలో ఉంటూ చదువుకుంటున్నాడు. ఉద్యోగం వచ్చిన తర్వాత ప్రేమించిన అమ్మాయిని వివాహం చేసుకోవాలని కుటుంబ సభ్యులు చెప్పారు. మరో వైపు ప్రేమించిన అమ్మాయి తనను త్వరగా పెళ్లి చేసుకోవాలని తరచూ ఒత్తిడి చేయడంతో తీవ్ర ఒత్తిడికి గురై ఉరివేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తహసీల్దార్

• ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ మార్చి 29: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డ పెళ్లి కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎంతో ముందు చూపుతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందించారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు ఇచ్చే సాయంతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 15 నెలలైనా అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలి బిన్ అహ్మద్ ,తహసీల్దార్ రోహిత్, డిప్యూటీ తహసీల్దార్ పోచయ్య నాయకులు రవీందర్, భీమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి భూసంబంధిత సమస్యలను పరిష్కరించాలి

• మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మార్చి 29 : ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలో సింగరేణి సంస్థ పరిధిలోకి వచ్చే భూసమస్యలపై అర్జీలను రెవెన్యూ రికార్డులను సరి చూసి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఒక నెలలోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ సింగేణి సంస్థ శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల జీఎంలు శ్రీనివాస్, దేవేందర్, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సింగరేణి ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులో భాగంగా జైపూర్ మండలం గుత్తేదారుపల్లెలో భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం త్వరగా అందించాలన్నారు. సింగరేణి భూముల్లో ఆక్రమణలను తొలగించాలన్నారు. సింగరేణి సంస్థ పరిధిలోకి వచ్చే భూములు, ఆస్తి పన్నులను ఎలాంటి బకాయి లేకుండా పూర్తి చేయాలని, సింగరేణి సంస్థ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎస్టేట్ అధికారి నవనీత, కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకులు సంతోష్, రెవెన్యూ అధికారులున్నారు.

అన్ని దానాల్లో రక్తదానం గొప్పది

రక్తదానం చేస్తున్న జడ్జి ముఖేశ్ కుమార్

బెల్లంపల్లి, మార్చి 29 : అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముఖేశ్ కుమార్ తెలిపారు. జనహిత సేవా సమితి ఎనిమిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శనివారం తాపీ సంఘం భవనంలో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల సహాయార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. జడ్జి ముఖ్య అతిథిగా హాజరై రక్తదానం చేశారు. శిబిరంలో మొత్తం 122 యూనిట్ల రక్తం సేకరించారు. ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు కూడా పాల్గొని రక్తదాతలకు అభినందన ప్రతాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు సతీశ్, మాజీ కౌన్సిలర్ గెల్లి రాజలింగు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, కాసర్ల రంజిత్, సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించాలని నిరసన దీక్ష

మందమర్రి, మార్చి 29: మందమర్రి మున్సిపాలిటీ ఏర్పడి మూడు దశాబ్దాలు కావస్తున్నా ఎన్నికలు నిర్వహించక పాలక వర్గం లేక అభివృద్ధిలో కుంటుపడుతుందని మున్సిపల్ ఎన్నికల సాధన కమిటీ(జేఏసీ) సభ్యులు అన్నారు. మున్సిపాలిటీకి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట జేఏసీ నాయకులు, సభ్యులు ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. పలు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంఘాల నాయకులు దీక్షకు మద్దతు ప్రకటించారు. జేఏసీ కన్వీనర్ అందుగుల శ్రీనివాస్, సభ్యులు ఓ.రాజశేఖర్, కొంగల తిరుపతి రెడ్డి, ఎండి.అబ్బాస్, బోరిగం వెంకటేశ్, మిట్ట లక్ష్మన్, మద్ది శంకర్, మాయ రమేశ్, సీపెల్లి సాగర్, ఒడ్నాల శంకర్, రాయబారపు వెంకన్న, రాంసాని శేఖర్, సప్పిడి నరేశ్, అఖిలేశ్ పాండే పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, వెరబెల్లి రఘునాథ్ సంఘీభావం తెలిపారు.

చెత్తట్రాలీలను అడ్డుకున్న శాంతిఖని వాసులు

బెల్లంపల్లి, మార్చి 29 :పట్టణంలోని శాంతిఖని 65 డిప్ ప్రాంతంలో డంప్ యార్డ్ కోసం చెత్త ట్రాలీల ద్వారా చెత్తను డంప్ చేయడానికి వచ్చిన మున్సిపల్ ట్రాలీలను శనివారం బస్తీ ప్రజలు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. తమ బస్తీలో డంప్ యార్డ్ ఏర్పాటు చేయనివ్వబోమని వారు స్పష్టం చేశారు. పాత మున్సిపల్ కార్యాలయం ముందు రైతు బజార్ లో ఏర్పాటు చేసిన డంప్ యార్డ్‌ను వెంటనే తొలగించాలని అక్కడి బూడిదగడ్డ బస్తీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేయడంతో అక్కడి నుంచి చెత్తను శాంతిఖని 65 డిప్ ప్రాంతానికి తరలించేందుకు మున్సిపల్ సిబ్బంది యత్నించారు. అక్కడి ప్రజలు విషయాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకురావడంతో పీఏ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తో మాట్లాడారు. దీంతో చెత్త డంప్‌ను నిలిపి వేయించడంతో వారు శాంతించారు.

అర్ధరాత్రి యువకుల వీరంగం

మంచిర్యాల అర్బన్, మార్చి 29: మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి కొందరు యువకులు వీరంగం సృష్టించిన ఘటన శనివారం కలకలం రేపింది. రెండు రోజుల క్రితం ఎలైట్ బార్లో తాగిన మైకంలో యువకులు బీరు సీసాలతో దాడికి పాల్పడిన ఘటన మరవకముందే శుక్రవారం అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో జరిగిన మరో ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డైమండ్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్దకు హమాలీవాడకు చెందిన కుంట రాజేంద్ర ప్రసాద్, బద్రి ధర్మతేజ, సాజన్‌తో పాటు మరో వ్యక్తి కలిసి ఇక్బాల్, అహ్మద్‌నగర్ కు చెందిన సయ్యద్ ముస్సేబ్ అలీతో గొడవకు దిగి దాడి చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని వారి చెదరగొట్టారు. ఈ విషయమై పట్టణ సీఐ ప్రమోద్ రావును వివరణ కోరగా సయ్యద్ ముస్సేబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామాల్లో ఉగాది సందడి

ఎడ్లకు నైవేద్యం పెడుతున్న ఆదివాసీలు

కాసిపేట, మార్చి 29 : కాసిపేట మండలంలోని సాలెగూడ గ్రామంలో అమావాస్య శనివారం ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉగాదిని(మండ ముష్) నూతన సంవత్సరంగా ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలతో ఉదయం ఇంటిని శుభ్రం చేసి తోరణాలు కట్టి, ఈ సంవత్సరంలో పండిన నూతన పంటను గూడలుగా చేసి, ఎడ్లను స్నానం చేపించి రంగులు పూసి, మెడకు పట్టీలు, గజ్జెలు కట్టి అందంగా అలంకరించి గుమ్మం(వాకిలి) ముందు నిలబెట్టి మొక్కి గూడలను నైవేద్యంగా సమర్పించారు. మిగిలిన వాటిని పటేల్ ఇంట్లో గ్రామంలోని అందరూ కలిసి కూర్చొని ఫలహారంగా తిని ఉగాది ఉత్సవాలు నిర్వహించారు.

లిప్రసీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

మందమర్రి, మార్చి 29: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లిప్రసీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎల్‌సీడీసీ రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ సాగర్ సూచించారు. మండల పరిధిలోని అందుగులపేట గ్రామంలో నిర్వహిస్తున్న లిప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపేయిన్(ఎల్‌సీడీసీ) సర్వేను శనివారం ఆయన స్థానిక వైద్యులతో కలిసి పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీ పరిధిలో చేపడుతున్న యాక్షన్ ప్లాన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుగులపేటలో ఇద్దరికి లిప్రసీ సోకినట్లు గుర్తించి వారికి మందులను పంపిణీ చేసి, ఎండీటి చికిత్స గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రమేశ్, అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు మానస, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, డీపీఎంవో రాఘవయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నిరసన

రోడ్డుపై నిరసన తెలుపుతున్న కార్మికులు

కాసిపేట, మార్చి 29 : కాసిపేటతో పాటు మందమర్రి ఏరియాలోని కాసిపేట 1 ఇంక్లైన్, 2 ఇంక్లైన్ బొగ్గు గనులకు వెళ్లే రహదారి మరమ్మతులు చేపట్టాలని రోడ్డుపై కార్మికులు నిరసన వ్యక్తం చేసి ధర్నా చేశారు. దుబ్బగూడెం నుంచి కాసిపేట వరకు రోడ్డు ధ్వంసమై గుంతలు పడి రహదారిపై ప్రజలు, సింగరేణి కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికే ఇద్దరు కార్మికులు గుంతలో పడి ప్రమాదాలకు గురయ్యారన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, స్థానిక శాసన సభ్యులు, సింగరేణి యాజమాన్యం, మందమర్రి జీఎం స్పందించి వెంటనే ఈ రోడ్డును మరమ్మతులు చేసి ప్రజల, కార్మికుల క్షేమానికి కృషి ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, మీనుగు లక్ష్మీనారాయణ, ఎస్ నాగేశ్వరరావు, సంపత్, సతీశ్ కుమార్, కొండపల్లి నర్సయ్య, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో ఇఫ్తార్

మంచిర్యాల అర్బన్, మార్చి 29: మంచిర్యాల పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విరమింపజేసీ ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఒక్కరోజులో 3.25 లక్షల టన్నుల బొగ్గు రవాణా

• సింగరేణి చరిత్రలో శుక్రవారం ఆల్‌టైం రికార్డ్

• ఉద్యోగులను అభినందించిన సీఎండీ ఎన్.బలరామ్

శ్రీరాంపూర్, మార్చి 29 : సింగరేణి చరిత్రలో శుక్రవారం బొగ్గు రవాణాలో ఆల్‌టైం రికార్డు నమోదైంది. మూడు షిఫ్టులలో కలిపి సింగరేణి మొత్తం మీద 3,25,243 టన్నుల బొగ్గును వినియోగదారులకు రవాణా చేశారు. దీనిలో రైల్వే రేకుల ద్వారా గత ఏడాదితో పోల్చితే అత్యధికంగా బొగ్గు రవాణా చేయడం కూడా మరో ఆల్ టైం రికార్డుగా చెప్పవచ్చు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్.బలరాం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి శనివారం ఉదయం డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి అభినందనలు తెలిపారు. అందరూ సమష్టిగా కృషి చేయడంతోనే ఈ అరుదైన రికార్డు సాధ్యమైందనీ, ఇదే స్ఫూర్తితో లక్ష్యాలు సాధించాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధనకు గట్టి పునాది వేయాలని కోరారు. రానున్న రోజుల్లోనూ ఇదే విధంగా అన్ని థర్మల్ కేంద్రాలకు సమృద్ధిగా బొగ్గు సరఫరా చేయడానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. కొత్తగూడెం నుంచి ఎక్కువ పరిమాణంలో బొగ్గు సరఫరా చేయడంపై వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వీకే ఓపెన్ కాస్ట్‌కు పర్యావరణ అనుమతులు

ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త గూడెం వెంకటేశ్‌ఖని(వీకే) ఓపెన్ కాస్ట్‌కు న్యూఢిల్లీలో జరిగిన ఎన్విరాన్మెం